ప్రజాశక్తి
గురువారం 14 మార్చి 2024





కలెక్టరేట్లో మొల్లమాంబకు నివాళి అర్పిస్తున్న అధికారులు

కవయిత్రి మొల్లమాంబకు నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విలువలతో కూడిన కవిత్వాన్ని అందించిన మొల్లమాంబకు జిల్లా అధికారులు నివాళులు అర్పించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహించారు. మొల్లమాంబ చిత్ర పటానికి డిఆర్‌ఒ కొండయ్య, బీసీ కార్పొరేషన్ అధికారి నిర్మల, అహుడా వైస్ ఛైర్మన్ లక్ష్మీ నరసమ్మ, కుమ్మరి కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ రామాయణంను వివిధ భాషల్లో ఎందరో రచించారన్నారు. వాల్మీకి రచించిన రామాయణం గ్రంథాలను ఆధారం చేసుకుని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు భాషలో మొల్ల రామాయణం రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. 2017 సంవత్సరంలో భారత ప్రభుత్వం మొల్ల జ్ఞాపకార్థం తపాలా బిళ్ల విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటనారాయణ, నాగరాజు, రామలింగేశ్వర, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, పాల్గొన్నారు

జిల్లా పోలీసు కార్యాలయంలో

జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పందన కాన్ఫరెన్స్ హాల్లో మొల్లమాంబ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. మొల్లమాంబ చిత్ర పటానికి ఎస్పీ మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణంను వివిధ భాషల్లో ఎందరో రచించారన్నారు. అందులో మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు భాషలో మొల్ల రామాయణం రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, సైబర్ క్రైమ్ సిఐ హేమంత్ కుమార్, ఆర్ఐలు చంద్రశేఖర్, వలి, సూపరింటెండెంట్ సరస్వతి, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, మురళి, శీన తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఎన్నికలకు సంసిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేశాం
కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని విధాలా సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి బుధవారం నాడు ఎన్నికల సంసిద్ధతపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. శ్రీ సత్యసాయి కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలా సంసిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఫామ్ 6, 7, 8 ఫిర్యాదులకు సంబంధించి ఎప్పటికప్పుడు విచారణ చేసి పరిష్కరిస్తున్నామని తెలియజేశారు. ఇప్పటివరకు వచ్చిన అన్ని ఎపిక్ కార్డులను ఓటర్లకు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ నియోజకవర్గ ఎన్నికల అధికారులతో మాట్లాడారు. గృహ ఓటింగ్‌పై 85 సంవత్సరాల పైబడిన వద్ధులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. శిక్షణకు ఉపయోగించిన ఈవీఎంలను ఆయా నియోజకవర్గాల ప్రధాన కేంద్రాలకు పటిష్టమైన భద్రత మధ్య తరలించాలని ఆదేశించారు, అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. అనంతరం కలెక్టర్ స్వీప్ ఆధ్వర్యంలో ముద్రించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కొండయ్య, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, నియోజకవర్గ ఎన్నికల అధికారులు పుట్టపర్తి భాగ్యరేఖ, ధర్మవరం వెంకట శివసాయి రెడ్డి, మడకశిర గౌరీ శంకర్ పాల్గొన్నారు.



ఉనికి కోల్పోతున్న

ధర్మవరం చేనేత..!

ధర్మవరం అంటేనే గుర్తుకొచ్చేది చేనేత. శిల్క్ సిటీగా పిలుచుకునే ఈ ప్రాంతం దాని అస్తిత్వాన్ని క్రమంగా కోల్పోతోంది. చేనేత మగ్గాలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో మరమగ్గాలు విస్తరిస్తున్నాయి. చాలా ఎళ్లుగా చేనేత స్థానంలో మరమగ్గాలు తీసుకొచ్చే ప్రయత్నాలు సాగుతూ వచ్చినప్పటికీ స్థానిక నేత కార్మికులు పోరాటం చేసి వాటిని అడుగు పెట్టకుండా నిరోధిస్తూ వచ్చారు. అయితే ఈ ఐదేళ్ల కాలంలో ఈ ప్రాంతంలోకి మరమగ్గాలు చాపకింద నీరులా విస్తరించిపోయాయి. దీంతో క్రమంగా చేతి మగ్గాలు కనుమరగువుతూ వస్తున్నాయి.

- ◆ మాయమవుతున్న చేతి మగ్గాలు
- ◆ చాపకింద నీరులా విస్తరించిన మరమగ్గాలు
- ◆ మాటల్లోనే ఎన్నికల హామీలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ధర్మవరం అంటేనే హ్యాండ్‌లూమ్ కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకప్పుడు 30 వేలకుపైగా ఇక్కడ చేతి మగ్గాలు ఉండేవి. ఇప్పుడు ఐదు వేలలోపునకే వచ్చేశాయి. అదే పరిస్థితిల్లో 12 వేల వరకు మరమగ్గాలు ధర్మవరంలో ప్రస్తుతం ఉన్నట్టు తెలుస్తోంది. చేనేత వస్త్రాలను మరమగ్గాలపై నేయకూడదని 11 రకాల రిజర్వేషన్లను సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బుట్టదాఖలవుతోంది. యథేచ్ఛగా చేనేత రిజర్వేషన్ చట్టం ఉల్లంఘన జరుగుతోంది. పవర్‌లూమ్స్‌లో హ్యాండ్‌లూమ్ రకాలను నేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో ధర్మవరంల చేనేత వృత్తి పూర్తిగా లేకుండాపోతుందనే ఆందోళన కార్మికుల్లో వ్యక్తం అవుతోంది. మరోవైపు చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధించడంతో ముడిపట్టు ధరలు కూడా పెరిగాయి. ఎన్నికలకు ముందు చేనేతలకు అండగా ఉంటామని ప్రభుత్వం ప్రకటించింది. కాని ఆచరణలో ఆదుకున్న చర్యలేవీ ఉండటం లేదు. నేతన్న నేస్తం పేరుతో ఏడాదికి రూ.24 వేలు ఇవ్వడంతోనే సరిపెడుతున్నారు. అంతకు మునుపున్న చేనేత రాయితీ లేదు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం కూడా పూర్తి స్థాయిలో అందడంలేదు.

సిబిఆర్ నిర్వాసితులకు అందని పూర్తి స్థాయి పరిహారం

ధర్మవరం నియోజకవర్గం పరిధిలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ని పూర్తి స్థాయి సామర్థ్యంతో నింపారు. ఈ సమయంలో మరిమేకలపల్లి గ్రామం పరిధిలో నిర్వాసితులకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.10 లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఆ గ్రామంలో నిర్వాసితులుగానున్న ఎస్సీలకు ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా పరహారం అందలేదు. దాని కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఇక ముదిగుబ్బలో నిర్మిస్తున్న జిల్లేడుబండ నిర్వాసితులు కూడా పరిహారం కోసం ఎదురు చూసే పరిస్థితులున్నాయి.

పశువుల కాపురులకు తప్పని కష్టాలు

ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బలో పశువుల పెంపకం, గొర్రెల పెంపకందారులు అధికంగా ఉన్నారు. పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. సరైన బీమా సౌకర్యం లేదు. మందులు సకాలంలో అందించే పరిస్థితుల్లేవు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇవ్వడం తరువాత మర్చిపోవడం పరిపాటిగా మారిదంటూ ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులోనూ సమస్యలపై స్పందించేలా నాయకుల కార్యచరణ ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాప్తాడులో ప్రశాంత వాతావరణం

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



చేయూత మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధికారంలోకి వచ్చాక రాప్తాడు నియోజకవర్గంలో ఎక్కడా ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలియజేశారు. బుధవారం నాడు కనగానపల్లి, రామగిరి మండలాల్లో నిర్వహించిన వైఎస్ఆర్ చేయూత కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిటాల కుటుంబం పాలనలో రాప్తాడులో దోపిడీ జరిగిందన్నారు. వైసిపి అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమ ధ్యేయంగా పాలన సాగించామని తెలియజేశారు. గడిచిన ఐదేళ్లలో చిన్న గొడవ కూడా లేకుండా నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉంచామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఓపెన్ స్కూల్లో విద్యార్థులను పాస్ చేయిస్తామని ఒక విద్యార్థి నుంచి రూ. 12వేల నుంచి 15 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని ఈ చర్యలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాజర్‌కు సమర్పించారు. ఈ పరీక్షలలో 2500 మందికి పైగా 15 కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారన్నారు. రెండు రోజుల క్రితం హాల్ టికెట్లు రావడంతో ప్రతి విద్యార్థికి ఫోన్ చేసి పరీక్షలలో మెయింటెనెన్స్ కోసం ఒక్కొక్క విద్యార్థి వెయ్యిరూపాయల వరకు వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన ఫీజు మాత్రమే కట్టించుకుని మిగతా ఫీజు విద్యార్థులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా విద్యార్థులతో డబ్బులు వసూలు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నాగార్జున, బాబావలి, బాబ్జాన్, వీరేష్, హర్ష కుమార్, భగత్, హరి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'పిఎం సూరజ్' కింద జిల్లాలో 147 మందికి లబ్ధి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పిఎం సురాజ్ పథకం క్రింద జిల్లాలో ఎస్సీ, ఒబిసి, సఫారీ కర్మచారీకార్మికులకు సంబంధించి 147 మంది లబ్ధిదారులకు 12.74 కోట్ల రూపాయలు లబ్ధి చేకూరినట్లు డిఆర్‌ఒ కొండయ్య తెలిపారు. బుధవారం కలెక్టరేట్లో డిఆర్‌ఒ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివలింగ ప్రసాద్ తదితరులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 522 జిల్లాల నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఈ పథకం ద్వారా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నిధులు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిక శాఖ ద్వారా విడుదల అయ్యాయని అన్నారు. అనంతరం పారిశుధ్యకార్మికులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులను, కిట్లను అందజేశారు. ఆ తర్వాత లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.

ఉత్సవ విగ్రహాల్లా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్



అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్ల అధికారాలు, హక్కులను రాష్ట్ర ప్రభుత్వం హరించి వారిని ఉత్సవ విగ్రహాల్లా మార్చేసిందని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి. రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం నాడు ఉమ్మడి జిల్లాకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పంచాయతీల నిధులు, సర్పంచుల అధికారాలు, విధులను హరించారన్నారు. వాటిని తిరిగి ఇవ్వమని రాజకీయాలకు అతీతంగా ఉద్యమం చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఉద్యమంలో అన్ని పార్టీలకు సంబంధించిన సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు భాగస్వాములు అవుతున్నారని తెలియజేశారు. మహాత్మా గాంధీ పేర్కొన్న "గ్రామ స్వరాజ్య" సాధన కోసం రాష్ట్రంలోని 12,918 మంది సర్పంచులు రాజకీయాలకు అతీతంగా ఐక్యమై గత రెండున్నర సంవత్సరాలుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తున్నట్లు చెప్పారు. సర్పంచుల సంఘం కోరుతున్న 16 డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయకపోవడంతో గ్రామాలు, వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులూ చేయలేక సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు ప్రజల చేత తీవ్ర విమర్శలకు గురవుతున్నారన్నారు. స్థానిక సంస్థలు నిర్వీర్యం కావడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే కారణం అన్నారు. మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పల్లెలు శిధిలమైపోయి, గ్రామీణ ప్రజలు నాశనం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైసిపిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్క ధనుంజయ యాదవ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, పంచాయతీరాజ్ ఛాంబర్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దేగల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



లేపాక్షిలో పోలీసు కవాతు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పరిగి : సాధారణ ఎన్నికల నేపథ్యంలో పరిగి మండల వ్యాప్తంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని సిఐ యుగంధర్ హెచ్చరించారు. సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో ఆర్మీ మార్చ్‌ను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు బుధవారం కవాతు చేపట్టారు. 131వ బెటాలియన్ కు చెందిన 60 మంది బి ఎస్ యఫ్ అధికారులు, సిబ్బంది కల్లూరు, కొండూరు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీకంజాక్షన్, హిందూపురము సిఐ ఈరన్న, లేపాక్షి, చిలమత్తూరు ఎస్ఐలు గోపీ, గంగాధర్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఎపి వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు లభించింది. గుర్తింపు ఇచ్చినందుకు ఆ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రమణ రెడ్డి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్సీలు కల్ప లతా రెడ్డి, ఎం వి రామచంద్ర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘం ద్వారా తమకు మరింత బాధ్యత పెరిగిందని ప్రభుత్వానికి ప్రభుత్వ పాఠశాలలకు మధ్య వారధిగా ఉంటూ ప్రతి ప్రభుత్వ పథకం పేద పిల్లలకు అందే విధంగా కృషి చేస్తామని అన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అయ్యేవిధంగా పనిచేస్తామన్నారు.

రాష్ట్రాభివృద్ధి వైసిపితోనే సాధ్యం

ముదిగుబ్బ : రాష్ట్రాభివృద్ధి వైసిపితోనే సాధ్యమని ధర్మవరం శాసనసభ్యులు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల కేంద్రంలోని నూర్ బాషా దూదేకుల కాలనీ, నాయి బ్రాహ్మణ కాలనీ, పాత ఊరు, ప్రధాన రహదారిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, తిరుమల సేవే నాయక్, సివి నారాయణరెడ్డి, భాస్కర్, సర్పంచి లక్ష్మీదేవి చంద్రాయుడు పాల్గొన్నారు.

న్యూరోథెరపీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

షిఫా న్యూరో థెరపీ ఆక్యుపంక్చర్ క్లినిక్‌ను ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ సి వి.మదన్ కుమార్, సీనియర్ డాక్టర్ శంకరయ్య బుధవారం ప్రారంభించారు. పట్టణంలోని కాలేజ్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అల్ షిఫా న్యూరో థెరిపి, ఆక్యుపంక్చర్ క్లినిక్, రజి యునాని ఆయుర్వేద మెడికల్ ప్రారంభోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ఈ న్యూరో థెరపీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉత్కంఠకు తెర..

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా కందికుంట.?

ప్రజాశక్తి - కదిరి టౌన్



సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్తుండడంతో మూడు పార్టీల సీట్ల సర్దుబాటు పూర్తయింది. టిడిపి జనసేన కూటమితో 99 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితా ఇప్పటికే ప్రకటించగా బిజెపితో పొత్తు కారణంగా రెండో జాబితా ఆలస్యమైంది. బీజేపీతో పొత్తు అనంతరం రెండో జాబితా కసరత్తు పూర్తయిన సందర్భంలో గురువారం టిడిపి రెండో జాబితాను విడుదల చేయనుంది. మొదటి జాబితాలో కదిరి నియోజవర్గానికి సంబందించి అభ్యర్థికి చోటు దక్కలేదు. రెండో జాబితాలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కందికుంట పేరు ఉంటుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే అధిష్టానం నుండి స్పష్టమైన హామీ కూడా వచ్చినట్టు ఆ పార్టీకి చెందిన ప్రధాన నాయకుడు చెప్పారు.కందికుంట పేరు దాదాపు ఖరారు అవడంతో చంద్రబాబు ప్రకటించే రెండో జాబితాకోసం కదిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు.

టిడిపిని ఆదరించండి

కదిరి టౌన్ : టీడీపీ కదిరి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి యశోదదేవి బుధవారం పట్టణంలోని 9 వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి, జనసేనఉమ్మడిగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న దృశ్యం

జెఎన్‌టియు ఎంసిఎ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఎంసీఏ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఒకటవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు, ఎంసీఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్20), (ఆర్17) సప్లిమెంటరీ, రెండవ సెమిస్టర్ (ఆర్21), (ఆర్20), (ఆర్17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్17) సప్లిమెంటరీ, ఎంబీఏ రెండవ సెమిస్టర్ (ఆర్21), (ఆర్17) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్ సైట్ www.jntua.ac.inలో చూడాలని తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి -ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురంలోగల యశోద కాన్సెప్ట్ స్కూల్లో బుధవారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర పర్యవేక్షణ అధికారిని ప్రభ పాఠశాలలోని పదవతరగతి విద్యార్థులకు ఎకో క్లబ్స్ ఆవశ్యకత, లైఫ్ స్కిల్స్, కాలుష్యను నివారించేందుకు మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గోపాల్‌నాయక్, క్లస్టర్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపల్ అనూప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

బుక్కపట్నం : వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ ప్రసాద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవోలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి.. సంక్షేమం

బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి



చిలమత్తూరులో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వసుంధర దేవి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతో పాటు నియోజక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే బాలకృష్ణ తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారని బాలయ్య సతీమణి నందమూరి వసుంధర దేవి అన్నారు. బుధవారం నియోజక వర్గంలో ఎమ్మెల్యే బాలయ్య తన సొంత నిధులతో చేపట్టిన పలు కార్యక్రమాలను వసుంధర దేవి ప్రారంభించారు. తొలుత చిలమత్తూరు మండలంలో శెట్టిపల్లి, మొరంపల్లి గ్రామాలలో శుద్ధ జల ప్లాంట్లను ప్రారంభించారు. అనంతరం హిందూపూరం మున్సిపల్ పరిధిలోని ముదిరెడ్డిపల్లి, పోచనపల్లి గ్రామాలలో శుద్ధ జల ప్లాంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు నియోజవర్గ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గుంటూరుకు చెందిన మన్నల మోహన్‌కృష్ణ సహాయ సహకారాలతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారన్నారు. ఎంతో నమ్మకం ఉంచి బాలయ్యను రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసిన నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో నందమూరి బాలకృష్ణ పరితపిస్తుంటారన్నారు. వ్రచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, బాలయ్య అభిమానులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని మొరంపల్లి,కోడూరు గ్రామాలలో వాటర్ ప్లాంట్లను శాసన సభ్యులు నందమూరి బాలక్రిష్ణ సతీమణి వసుందర దేవి చేతుల మీదుగా బుధవారం ప్రారంబించారు.ఈ మేరకు ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజల దాహాన్ని తీర్చేందుకు ఉచితంగా వాటర్ ప్లాంట్ లను ప్రారంబించామని అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే బాలక్రిష్ణ ప్రతి పంచాయతీ కేంద్రంలో తన స్వంత డబ్బులతో ఉచితంగా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి -పెనుకొండ



ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మునిమడుగు పంచాయతీ నుంచి ఎన్నికల శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మునిమడుగు గ్రామంలో సీనియర్ టీడీపీ నాయకులు చిన్నవెంకటరాముడు, మల్లికార్జున, ఆంజనేయులు, రమేష్ నాయుడు, పార్టీ శ్రేణులు సవితమ్మకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్నారాయణ ఈ ఐదేళ్ల కాలంలో గ్రామానికి చేసిందేమీ లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థినైన తనను ఆదరించాలని కోరారు. అనంతరం అమ్మవారుపల్లి, చిన్నపరెడ్డి పల్లి, మోటువారి పల్లి, కురుబవాండ్ల పల్లి, హరిపురం గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పలువురు టీడీపీ లోకి చేరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ నరసింహ రావు, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - నల్లచెరువు



నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో నాబార్డ్ నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులనుకదిరి శాసనసభ్యులు డాక్టర్ పివి. సిద్దారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు ఉపయోగకరమైన అవసరమైన అదనపు తరగతి గదులను త్వరితగతిన నిర్మించి, వారికి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలుపుల : తలుపుల-3 గ్రామ సచివాలయం పరిధిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్ర భవనాలను కదిరి శాసనసభ్యులు డాక్టర్ పి వి సిద్ధారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపితోనే ప్రజాసంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

వైసిపితో ప్రజాసంక్షేమం సాధ్యమని వైసిపి నాయకులు అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని అగళి,రొళ్ల మండల కేంద్రంలో నాలుగవ విడత వైయస్సార్ ఆసరా చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రొళ్ల మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, వైస్సార్సీపీ సమన్వకర్త ఈరలక్కప్ప, జడ్పీటీసీ అనంతరాజు హాజరై మహిళా సంఘాల సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా చేయూతకు సంబంధించిన మెగా చెక్‌ను అందజేశారు. ఈకార్యక్రమాల్లో మాజీ మంత్రి నరసేగౌడ్, రొళ్ల,గుడిబండ జడ్పీటీసీ లు అనంతరాజు, భూతరాజు, అగళి, రొళ్ల ఎంపీపీలు రేణుకా, కవిత, కుంచిటి వక్కలిగ ఛైర్పర్సన్ నళిని రంగేగౌడ్, అగళి, రొళ్ల వైస్సార్సీపీ కన్వీనర్లు స్టూడియో శ్రీనివాస్, నరసింహారెడ్డి, అగళి, రొళ్ల జేసీఎస్ కన్వీనర్లు మహేంద్ర,నాగేంద్ర, మహిళా సంఘాల సభ్యులు, వైఎస్ఆర్‌క్రాంతి పథం అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని సాయిబాబా దేవాలయం ఆవరణములో బుధవారం వైయస్సార్ ఆసరా చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్నినిర్వహించారు. మడకశిర ఇందిరా క్రాంతి పథకం ఏరియా కోఆర్డినేటర్ ఎస్ఆర్ నాగరాజు సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి, వక్కలిగ సంఘం అధ్యక్షురాలు. నళిని, ఎంఎస్ ప్రతినిధులు జ్యోతి తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

కదిరి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

అందరి సమిష్టి సహకారంతో ఖాద్రీ లక్ష్మినరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దామని స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పిలుపునిచ్చారు. ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుండి ప్రారంభం కానున్నాన్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆలయంలో డిప్యూటీ కమిషనర్ వెండిదండి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు 15 రోజులపాటు జరుగుతాయని అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. గత ఏడాది ఎదురైనా అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పార్కింగ్, భగుతీర్థం, దైవదర్శనం, తాగునీరు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారులు సహకరించకపోవడం వల్ల భగుతీర్థంను అందుబాటులోకి తీసుకురాలేకపోయామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి, వివిధ శాఖల అధికారులు, పలు పార్టీల నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని ఆయా గ్రామాల్లో వైసిపి నాయకులు చరణ్ రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్‌రెడ్డి మండలంలోని సానిపల్లి, చోలేమరి, నల్లూరు, పి.రొప్పాల, కలిపి, శేషాపురం, చెరుకూరు, చిన్నమంతురు, దొడగట్ట, రెడ్డిపల్లి, రొద్దం, తాడంగిపల్లి, మోపర్లపల్లి, యం.కొత్తపల్లి, నారానాగేపల్లి, బూచర్ల, ఆర్.లోచర్ల, పెద్దకోడి పల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. వైసిపి చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, మండల కన్వీనర్ తిమ్మయ్య, బి.నారాయణరెడ్డి, మారుతి రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -మడకశిర

మొట్టమొదటి సారి ఓటు హక్కు వినియోగించు కోబోయే యువతీ యువకులకు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. పట్టణంలోని ఎస్వైటి డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఓటుహక్కు ఆవశ్యకతను వివరిస్తూ టిడిపి వల్ల రాష్ట్రానికి జరిగే మేలును వివరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లు మర్రి వినయ్, మడకశిర అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సంతోష్ యాదవ్, శ్రీను, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు .

ప్రభుత్వ కళాశాల పరిశీలన

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని డీవీ అండ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ సౌరబ్‌గౌర్ బుధవారం సందర్శించారు. ఈ మేరకు కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పరీక్షకు విద్యార్థుల హాజరు శాతం, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో డిఐఇఒ రఘునాథరెడ్డి, ఆర్ఐఒ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో కొవ్వొత్తుల ర్యాలీ

కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

గీతాంజలి మృతికి సంతాపంగా వైఎస్ఆర్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందాయని సంతోషంగా చెప్పి తన భావాన్ని వ్యక్తీకరించిన తెనాలికి చెందిన మహిళ గీతాంజలిని టీడీపీ సోషల్ మీడియా అల్లరి మూకలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి మానసికంగా వేధించడం దారుణమని, వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న గీతాంజలిది ఆత్మహత్య కాదని టీడీపీ చేసిన హత్య అని వైఎస్ఆర్ విద్యార్థి విభాగ్ పట్టణాధ్యక్షుడు వినయ్ తేజ్ గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ స్థానిక కళాజ్యోతి సర్కిల్ నుండి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజారెడ్డి, అశోక్, విజయ్, జయసింహ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : టీడీపీ, జనసేన ట్రోలింగ్ వల్ల గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిందని, ఈమె ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వైసిపి ఎంపీ, ఎమ్మెలే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక డిమాండ్ చేశారు. గీతాంజలి మృతికి సంతాపం తెలియ చేస్తూ బుధవారం రాత్రి వైసిపి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ అండ్ బి అథితిగృహం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, పెద్ద ఎత్తున వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నాయకునిపై దాడి

హిందూపురం : వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు వాల్మీకి లోకేష్ పై గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ముదిరెడ్డి పల్లి ఆయన నివాసం వద్ద దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో లోకేష్ తలకు తీవ్ర గాయాలు అయినాయి. అడ్డుకోవడానికి ప్రయత్నం చేసిన లోకేష్ తమ్ముడి చేయిని కత్తితోకోశారు. గాయపడిన లోకేష్ తో పాటు తమ్ముడిని జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై స్థానికులు మాట్లాడుతు మూడు ద్విచక్ర వాహనాల్లో వచ్చి దాడి చేసి పరారీ అయినట్లు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, లోకేష్ వివరాలను సేకరించారు.

పాముకాటుతో రైతు మృతి

బుక్కపట్నం : మండల పరిధిలోని లింగప్ప గారి పల్లికి చెందిన రైతు పాముకాటుతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన రైతు మోటాచంద్రప్ప (45) బుధవారం ఉదయం తన వ్యవసాయ భూమిలో పనులలో పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో మోటా చంద్రప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు మతి చెందిన వార్త తెలుసుకొని ఎమ్మెల్యే తనయుడు కిషన్ రెడ్డి, పలువురు నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎనుములపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పలు ఇళ్లలో టీవీలు, ఫ్రిడ్జిలు, ఎలక్ట్రికల్ వస్తువులు దగ్ధమయ్యాయి. బుధవారం ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పలు ఇళ్లలోని ఎలక్ట్రికల్ వస్తువులు అన్నీ కాలి బూడిద అయ్యాయని బాధితులు వాపోయారు. దీంతో దాదాపు 50 వేల రూపాయల వరకు నష్టం వాటినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఆ గ్రామ విద్యుత్ లైన్మెన్ రామాంజిని వివరణ అడగగా మెయిన్ లైన్‌పై కోతి పడడంతో ఫేసు న్యూట్రల్ జాయింట్ కావడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంపై అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

రొద్దం : మండలంలోని రొద్దం మారెమ్మ దేవాలయ సమీపంలో నివాసమున్న వ్యక్తి గుండెపోటుతో బుధవారం మృతిచెందాడు. కాలనీకి చెందిన రసూల్(50) బుధవారం ఉదయం ఆర్. మరవపల్లి లో ఉన్న చింతచెట్లలో చింతకాయలు కోయడానికి కుటుంబసభ్యులతో కలసి వెళ్లాడు. చెట్టుపై ఉన్న రసూల్‌కు గుండెవద్ద నొప్పి రావటంతో విషయాన్ని భార్యకు చెప్పాడు. దీంతో ఆమె వెంటనే కిందికి దిగి రమ్మంది. చెట్టుపై నుంచి వచ్చిన రసూల్ నీరు తాగిన అనంతరం కొద్దిసేపటికి మృతిచెందాడు.

బాధితురాలికి ఆర్థికసాయం

ముదిగుబ్బ : మండలంలోని సానేవారిపల్లి గ్రామానికి చెందిన గంగులప్ప భార్య లక్ష్మికి ప్రమాదశాత్తు కింద పడి కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట సూర్యనారాయణ లక్ష్మీదేవికి వైద్య ఖర్చులకు రూ.15వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వర్గీయులు నారాయణస్వామి, దేవేందర్ నాథ్ రెడ్డి, లక్ష్మీనారాయణ, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు

అనారోగ్యంతో మహిళ మృతి

రొద్దం : మండలంలోని తురకలపట్నం గ్రామంలో మహిళ మృతిచెందింది. గుడిబండ మండలానికి చెందిన మంజుల అనే మహిళ తురకల పట్నం ఎస్సీ కాలనీలో రెండునెలలుగా ఇల్లు బాడుగకు తీసుకుని నివసిస్తోంది. రెండు రోజుల క్రితం తన ఆరోగ్యం సరిగా లేదని ఇరుగుపొరుగువారితో చెప్పుకుని వాపోయింది. అయితే బుధవారం ఉదయం మృతిచెందింది.

ఆలయ అభివృద్ధికి విరాళం

లేపాక్షి : మండలంలోని వడ్డిపల్లిలో గల మాచమ్మ దేవాలయ అభివృద్ధికి టిడిపి మండల కన్వీనర్ విరాళం అందజేశారు. టిడిపి మండల కన్వీనర్ జయప్ప ఆలయ అభివృద్ధి కోసం 10 వేల రూపాయలు విరాళం అందించారు.

బాధిత కుటుంబానికి 'అమ్మ' సంస్థ చేయూత

అనంతపురం : ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికి పరిమితమైన వినోద్ కుటుంబానికి బుధవారం 'అమ్మ' సంస్థ వ్యవస్థాపకులు తరిమెల రమణారెడ్డి చేయూతనందించారు. నగరంలోని సుందరయ్య కాలనీలో వున్న వినోద్, రేవతి దంపతులకు జ్యోషిక(5), హిరణ్య(15) సంతానం, రేవతి ప్రస్తుతం 8 నెలల గర్భిణి. వినోద్ ఏడేళ్లుగా చిత్రదుర్గలో ఓ లారీ యజమాని దగ్గర డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబా న్ని పోషించుకునేవాడు. గత జనవరి 12వ తేదీ ఓ ప్రమాదంలో కుడికాలు కోల్పోయాడు. ఎడమ కాలు, ఎడమ చేయికి ఆపరేషన్‌కు రూ. 4 లక్షల ఖర్చువుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థికసాయం కోసం ఎదరుచూస్తున్న వినోద్‌కు రమణారెడ్డి రూ. 50 వేల నగదు, రూ. 10 వేల వీల్‌ఛైర్, రూ. 5 వేల హెడ్ రెస్ట్, రూ. 30 వేల నిత్యావసర సరుకులు అందజేశారు. ఆపరేషన్‌కు డబ్బు సమకూరు స్తానని భరోసా ఇచ్చారు.

ఆలయ పునర్‌నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణ

పుట్లూరు : మండలంలోని చింతకుంట గ్రామంలో భైరవస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం లో భాగంగా బుధవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భూమిపూజ చేశారు. కార్యక్రమం లో ఇఒ శోభాలింగారెడ్డి, కమిటీ మెంబర్లు కులశేఖర్‌రెడ్డి, భైరవేశ్వరరెడ్డి, గోపాలరెడ్డి, వెంకటరామిరెడ్డి, పెద్దింటి కుళ్లాయిరెడ్డి, భగవత్, నాగేంద్ర, భైరవప్రకాష్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దవడుగూరు : మండలంలోని వీరన్నపల్లికి చెందిన రాము అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా బుధవారం దాడి చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అతడి నుంచి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఓ దుకాణం వద్ద ఉంచిన ద్విచక్ర వాహనం బుధవారం చోరీకి గురైంది. మధు తన ఫొటో స్టూడి యో ఎదురుగా పల్సర్ బైక్‌ను పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ బైక్‌ను ఎత్తుకెళ్లారు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేక పోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అబాకస్‌లో 'ట్రినిటీ' విద్యార్థి ప్రతిభ

పామిడి : విశ్వం ఎడ్యుకేషన్ ఆధ్వర్యం లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలో పట్టణంలోని ట్రినిటీ పాఠశాల విద్యార్థి మహమ్మద్ నసీర్ సీనియర్స్ విభాగం-2లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి పొందాడు. కరస్పాండెంట్ ఆర్థర్ లూయిస్ మాట్లాడుతూ ట్రినిటీ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారన్నారు. నసీర్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కారటిగి ఎక్స్‌ప్రెస్ రైలు పొడిగింపు

రాయదుర్గం : యశ్వంత్‌పూర్ నుంచి రాయదుర్గం మీదుగా కారటగి వరకూ ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైలు(16545/16546)ను ఈ నెల 15వ తేదీ నుంచి సింధనూరు వరకూ పొడిగిస్తున్నట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బిఎల్ శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపా రు. మిగిలిన ప్రయాణ వేళల్లో ఎలాంటి మార్పులు లేవన్నారు. కారటిగి నుంచి సింధనూరు వరకూ 19 కి.మీ. రైలు మార్గాన్ని అభివృద్ధి చేసినందున ఈ రైలు సర్వీస్‌ను కారటగి నుంచి సింధనూరు వరకూ పొడిగించినట్లు తెలిపారు. రైలు ప్రయాణికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14న ఆలయ పునర్ నిర్మాణానికి భూమిపూజ

పామిడి : మండలంలోని వంకరాజు కాలవ గ్రామంలో వెలసిన పప్పురమ్మ భైరవస్వామి ఆలయా న్ని రూ. 1.3 కోట్లతో పునర్ నిర్మిస్తున్నట్లు ఇఒ కృష్ణయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో భూమిపూజ కార్యక్రమం ఉంటుందని, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవు తారన్నారు.

సమస్యలకు సాంకేతికతతో పరిష్కారం చూపించాలి : విసి

ప్రజాశక్తి-అనంతపురం

యువత సాంకేతిక పరిజ్ఞానం జోడించి సమాజంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య జివిఆర్ శ్రీనివాసరావు సూచించారు. ఉన్నత విద్యాశాఖ, బిసిడిఇ, యూనిసెఫ్, విగ్యాన్ అశ్రం సంయుక్త ఆధ్వర్యంలో జెఎన్‌టియు అనంతపురం విశ్వవిద్యా లయం ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో 'అటల్ టింకరింగ్ ల్యాబ్' అంశంపై నిర్వహించిన 3 రోజుల వర్క్‌షాపును బుధవారం ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ యువత సమాజంలో ఉన్న సమస్యలకు సాంకేతిక పరిష్కారం ఇవ్వగలిగే సామర్థ్యం పెంపొందించు కోవాలన్నారు. కొత్తదనం, టెక్నాలజీని నేర్చుకొనే ఉత్సాహం ఉంటే సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారం ఇవ్వగలమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అటల్ ల్యాబ్స్ ఏర్పాటు చేసిందని, ఈ ల్యాబ్స్ విద్యార్థులకు సాంకేతికంగా, పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సత్యనారాయణ, సెక్రటరీ, సీఈఓ బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ఆచార్య దేవకుమార్, బీసీడీఈ విశ్వవిద్యాలయ కోఆర్డినేటర్ డా శ్రీనివాసులు, యూనిసెఫ్ కన్సల్టెంట్ కోఆర్డినే టర్ సుదర్శన్, విగ్యాన్ అశ్రం కార్యక్రమ అధికారి కిషోర్ గైక్వాడ్, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు